మధురవాడ జోనల్ ఆఫీస్‌కు న్యూ లుక్



రెండు దశాబ్దాల కిందట నిర్మించిన ప్రస్తుత జోనల్ ఆఫీసు



పనులు పూర్తయ్యాక జోనల్ కార్యాలయం ఇలా... (ఊహాచిత్రం)

- రూ.50 లక్షలతో చురుగ్గా పనులు

మధురవాడ : స్థానిక జోనల్ కార్యాలయం కొత్త రూపు సంతరించుకుంటోంది. అభివృద్ధి కార్యక్రమాల్లో భాగంగా మధురవాడ జోన్ – 2 కార్యాలయంలో కొన్ని విభాగాలు పునర్నిర్మించడంతోపాటు సుందరీకరణ పనులకు ప్రభుత్వం రూ.50 లక్షలు కేటాయించింది. ప్రస్తుతం ఈ పనులు చురుగ్గా సాగుతున్నాయి. స్మార్ట్ సిటీ, పరిపాలన రాజధానిలో భాగం కానున్న ఈ భవనం రూపురేఖలే పూర్తిగా మారిపోతున్నాయి. మరమ్మతులతోపాటు పుట్టీ, సీలింగ్, పెయింటింగ్, వైరింగ్ పనులు, కొత్తగా కిటికీలు, తలుపులు, ఫర్నిచర్ ఏర్పాటు చేస్తున్నారు. టాయిలెట్లు, ప్రహరీ నిర్మిస్తున్నారు. అలాగే ఫ్లోరింగ్, ఫుట్‌పాత్‌ని కూడా సుందరంగా తీర్చిదిద్దుతున్నారు. మొత్తం భవనాన్ని సుందరంగా, ఆకర్షణీయంగా తయారు చేస్తున్నామని జీవీఎంసీ కమిషనర్ సీఎం సాయికాంత్ వర్మ పేర్కొన్నారు. ఇటీవల ఆయన పనులను పరిశీలించి స్థానిక ఇంజినీరింగ్ అధికారులకు దిశానిర్దేశం చేశారు. పనులు త్వరగా పూర్తి చేయాలని, నాణ్యత ప్రమాణాలు పాటించాలని ఆదేశించారు. ఈఈ శాంతిరాజు పనులను పర్యవేక్షిస్తున్నారు.




కార్యాలయం నుంచి తొలగించిన ఫర్నిచర్



చురుగ్గా పనులు చేయిస్తున్న సిబ్బంది

హిందూ ధర్మ పరిరక్షణకు కృషి



ప్రసంగిస్తున్న కమలానంద భారతిస్వామి

సీతంపేట: సమాజంలో నానాటికీ పెరిగిపోతున్న గుణహీనత, కుసంస్కారంతో హిందూ సమాజం కుచించుకుపోయి సంకుచితమవుతోందని భువనేశ్వరి పీఠాధిపతి కమలానంద భారతి స్వామి అన్నారు. స్థానిక శంకరమఠంలో 'దేవాలయం కేంద్రంగా ధార్మిక, సామాజిక కార్యక్రమ నిర్వహణ' అనే అంశంపై ఆదివారం ఆయన ప్రసంగించారు. దేవాలయంలో దేవుడి ఎదుట కూర్చుని ఈ విషయాలపై చర్చించాలన్నారు. ప్రతి దేవాలయంలో హిందూ ధర్మ జాగరణ, హిందూ ధర్మ ప్రచారం, హిందూ ధర్మ రక్షణ జరగాలని, దీనికి ప్రతి ఒక్కరూ నడుం బిగించాలని పిలుపునిచ్చారు. ప్రస్తుత సమాజంలోని స్థితిగతులు, జీవన విధానం ఆలోచనలు, పద్ధతుల్లో వచ్చిన మార్పులు, వాటి పర్యావసానం, వాటి నియంత్రణకు అనుసరించాల్సిన విధానాలపై దిశానిర్దేశం చేశారు. ఈ సందర్భంగా సభికులు అడిగిన ప్రశ్నలకు కమలానంద భారతి స్వామి సమాధానాలిచ్చి సందేహ నివృత్తి చేశారు.

క్లుప్తంగా

ఆర్యవైశ్య యువజన సంఘ అధ్యక్షునిగా సునీల్



భీమునిపట్నం : భీమిలిలోని ఆర్యవైశ్య యువజన సంఘం అధ్యక్షునిగా న్యాయవాది ముమ్మిడిశెట్టి సునీల్ ఆదివారం ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు. కార్యదర్శిగా ఉసిరికల విశ్వేశ్వరరావు, కోశాధికారిగా ఉసిరికల వెంకటేష్ ఎంపికయ్యారు. అలాగే కన్యకాపరమేశ్వరి దేవస్థాన సంఘం అధ్యక్షునిగా పూసర్ల శ్రీనివాసరావు, కార్యదర్శిగా బొండా వెంకట నాగ బాలాజీ, కోశాధికారిగా మాదా వెంకట జగన్నాథ గుప్తా ఎన్నికయ్యారు. వాసవి ప్రార్థన మందిర సంఘానికి అధ్యక్షునిగా కట్టమూరి రమణారావు, కార్యదర్శిగా కంచర్ల కామేష్, కోశాధికారిగా బొండా కిరణ్ ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు. మాదా వెంకట పార్వతీశం ఎన్నికల అధికారిగా వ్యవహరించారు. పెద్దలు పోలిశెట్టి వెంకటేష్, ఉసిరికల బంగారురాజు, గుగ్గిళ్ల సాయి, కట్టమూరి వెంకన్నబాబు, బొండా నర్సింహమూర్తి, గుగ్గిళ్ల సతీష్ పాల్గొన్నారు.

ఇస్కాన్‌లో ప్రత్యేక పూజలు



ప్రత్యేక అలంకరణలో రాధాకృష్ణులు

కొమ్మాది : సాగర్‌నగర్ ఇస్కాన్ మందిరంలో ఆదివారం వారాంతపు పూజల్లో భాగంగా హరే కృష్ణ, హరేరామ నామస్మరణతో ప్రత్యేక పూజలు చేశారు. రాధాకృష్ణులు, సుభద్ర, బలభద్ర, జగన్నాథుడు, సీతారాములు, ఆంజనేయ, నరసింహస్వామి విగ్రహాలను వివిధ వర్ణాల పుష్పాలతో ప్రత్యేకంగా అలంకరించారు. స్వామివారి లీలలు, మహిమలను వర్ణిస్తూ భక్తులు భజనలు, గీతాలాపన చేశారు.

క్రికెట్ పోటీల విజేత ఏఎంసీ జట్టు



విన్నర్స్ జట్టుకు ట్రోఫీ అందిస్తున్న మజ్జి వెంకటరావు

తగరపువలస : ఆనందపురం మండలం తర్లువాడలో ఆంధ్ర మెడికల్ సెంటర్, విజయ డయాగ్నస్టిక్ సెంటర్, డయాగ్నోస్టిక్ డ్రాగన్స్ ఆధ్వర్యంలో నిర్వహించిన క్రికెట్ పోటీల్లో ఏఎంసీ జట్టు విన్నర్స్‌గా, డీడీ జట్టు రన్నర్స్‌గా నిలిచాయి. వీరికి వైఎస్సార్‌సీపీ మండల వర్కింగ్ ప్రెసిడెంట్ మజ్జి వెంకటరావు బహుమతులు అందించారు. స్వచ్ఛంద సంస్థలు క్రీడలను ప్రోత్సహించాలని ఆయన కోరారు. కార్యక్రమంలో ఎంపీటీసీ మాజీ సభ్యుడు సూరిబాబు, కోరాడ ఆదినారాయణ పాల్గొన్నారు.

కంటి ఆరోగ్యంపై ప్రత్యేక శ్రద్ధ

మురళీనగర్: కంటి ఆరోగ్యంపై ప్రత్యేక శ్రద్ధ వహించాలని నేత్ర వైద్యురాలు డాక్టర్ పితాని రమాదేవి సూచించారు. మురళీనగర్ వాకర్స్ పార్కులో వాకర్స్ క్లబ్ ఆధ్వర్యంలో క్వీన్స్ ఎన్‌ఆర్ఐ హాస్పిటల్స్ సహకారంతో ఆదివారం నిర్వహించిన ఉచిత వైద్య శిబిరంలో ఆమె మాట్లాడారు. ప్రతి ఆరు నెలలకు లేదా ఏడాదికోసారి కంటి వైద్య పరీక్షలు చేయించుకోవడం, కనుపాపల్లో తేలికపాటి సమస్యలు కనిపించగానే వైద్యుడిని సంప్రదించాలని సూచించారు. కంటి ఆరోగ్యం కోసం ఏ, సీ, ఈ విటమిన్లతో కూడిన ఆహారం తీసుకోవడం మంచిదన్నారు. టీవీ, మొబైల్, కంప్యూటర్లను పరిమితంగా వాడాలని సూచించారు. డాక్టర్ అరవింద్ మాట్లాడుతూ సమతుల ఆహారం తీసుకోవడం, రోజూ కనీసం 30 నిమిషాలు వ్యాయామం చేయడం మంచిదని వివరించారు. ఈ శిబిరంలో 194 మందికి బీపీ, సుగర్, ఈసీజీ పరీక్షలు ఉచితంగా నిర్వహించారు. పూర్వాధ్యక్షుడు సత్తి సునీల్ రెడ్డి వైద్య సిబ్బందికి పుస్తకాలు పంపిణీ చేశారు. వైద్యులను సత్కరించారు. క్లబ్ అధ్యక్షుడు పల్లా చంద్రమౌళి, పూర్వాధ్యక్షులు నిమ్మగడ్డ బుచ్చయ్య, సీహెచ్.కృష్ణమూర్తి, కె.ద్వారకానాథ్, సత్తి సునీల్‌రెడ్డి పాల్గొన్నారు.

తీరనున్న నీటి సరఫరా కష్టాలు

- రూ.3 కోట్లతో కొత్త పైప్‌లైన్ ఏర్పాటు
- చివరి దశకు చేరుకున్న పనులు



వేగవంతంగా జరుగుతున్న కొత్త పైప్‌లైన్ ఏర్పాటు పనులు

భీమునిపట్నం : భీమిలి పట్టణ ప్రజలకు మంచి నీరు సరఫరా చేయడానికి ప్రభుత్వం అందించిన నిధులతో కొత్త పైప్‌లైన్ పనులు పూర్తి కావచ్చాయి. మరి కొద్ది రోజుల్లో అందుబాటులోకి తీసుకొచ్చేందుకు అధికారులు సన్నాహాలు చేస్తుండడంతో ప్రజలకు నీటి సరఫరా కష్టాలు తీరనున్నాయి. ఇప్పటి వరకూ రోజూ తగరపువలస పంప్ హౌస్ నుంచి నీరు భీమిలికి పెద్ద పైప్‌లైన్ ద్వారా బ్యాంక్‌రోడ్డు, కృష్ణాకాలనీలోని ట్యాంకులకు సరఫరా చేస్తున్నారు. ఇక్కడి నుంచి పెద్ద బజారు, ఎగువపేట, నేరెళ్లవలస కాలనీ పరిసర ప్రాంతాలకు బ్యాంక్ రోడ్డు పక్కనున్న ట్యాంకు ద్వారా రోజుకు తొమ్మిది లక్షల లీటర్ల నీరు ప్రజలకు సరఫరా చేస్తారు. అలాగే కృష్ణాకాలనీ ట్యాంకు ద్వారా కృష్ణాకాలనీ, బ్యాంక్‌కాలనీ, చిన్నబజారు, గాడు వీధి, కొంకు వీధి, తోటవీధి ప్రాంతాలకు ఎనిమిది లక్షల లీటర్ల నీరు సరఫరా చేస్తారు. ఇదిలా ఉండగా గతంలో నాణ్యత లేకుండా వేసిన ప్రధాన పైప్‌లైన్ తరచూ పగిలిపోతుండడంతో నీటి సరఫరాకు పెద్ద ఆటంకంగా మారింది. అసలే రోజులో ఆయా ప్రాంతాలకు అర గంట సమయం మాత్రమే నీరు సరఫరా చేస్తుండగా... రెండు మూడు రోజులకు ఒకసారి పైప్‌లైన్ పగిలిపోవడంతో సుమారు రెండు నుంచి నాలుగు రోజుల వరకు నీటి సరఫరా నిలిచిపోయేది. దీంతో ప్రజలు నానా అవస్థలు పడేవారు. ఎంతో ప్రధానమైన ఈ సమస్య పరిష్కారంపై ఎమ్మెల్యే ముత్తంశెట్టి శ్రీనివాసరావు ప్రత్యేక దృష్టి సారించారు. ప్రభుత్వం దృష్టికి సమస్యను తీసుకెళ్లడంతో చిరకాలం పటిష్టంగా వుండేలా డీఐ 350 పైప్‌లు ఏర్పాటు చేసేందుకు రూ.3 కోట్లు మంజూరు చేసింది. అవసరమైన పైప్‌లను ఇటీవల భారీ వాహనాల ద్వారా ఉన్నతాధికారులు పంపించారు. వెంటనే స్థానిక అధికారులు జాప్యం చేయకుండా కొత్త పైప్‌లైన్ పనులు వేగవంతంగా పూర్తి చేయిస్తున్నారు. కొద్ది రోజుల్లోనే అందుబాటులోకి రానుందని, రోజూ నిరాటంకంగా నీటి సరఫరా జరుగుతుందని అధికారులు చెబుతున్నారు. తమ మంచినీటి కష్టాలు తీరనున్నాయని స్థానికులు ఆనందం వ్యక్తం చేస్తున్నారు.

బోరు చుట్టూ ఇటుకలతో ఇబ్బందులు



బోరు వద్ద అడ్డంగా ఉంచిన ఇటుకలు

కొమ్మాది : జీవీఎంసీ 8వ వార్డు ఎండాడ బీసీ కాలనీలో ఉన్న ఓ బోరు వద్ద చుట్టూ ఇటుకలు అడ్డంగా ఉంచడంతో స్థానికులు అసహనం వ్యక్తం చేస్తున్నారు. ఇక్కడ ఓ వ్యక్తి అనధికారికంగా ఓ భారీ భవనాన్ని నిర్మించడమే కాకుండా డ్రైనేజీ నుంచి బోరు వరకు పూర్తిగా మూసివేసి ఇటుకలు ఉంచడంతో నీరు పట్టుకోవడానికి ఇబ్బందులు ఎదుర్కొంటున్నామని స్థానికులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. దీనిపై జీవీఎంసీ, టౌన్ ప్లానింగ్ సిబ్బందికి ఫిర్యాదు చేసినా పట్టించుకోవడం లేదని, ఇప్పటికైనా చర్యలు తీసుకోవాలని కోరుతున్నారు.

హోమియో మందుల పంపిణీ



రోగులను పరీక్షిస్తున్న వైద్యులు

భీమునిపట్నం : స్థానిక కలిగొట్ల స్నిగ్ధ శ్రీదేవి ఫౌండేషన్ చైర్మన్ కలిగొట్ల శ్రీరామచంద్రమూర్తి పర్యవేక్షణలో ఆదివారం ఉచిత హోమియో వైద్య శిబిరం నిర్వహించారు. ఈ సందర్భంగా వంద మంది రోగులను పరీక్షించి అవసరమైన మందులు అందించారు. ఫౌండేషన్ సభ్యులు కె.ఎస్.ఎన్.మూర్తి, కె.భానోజీరావు, కె.శ్రీనివాసరావు, వి.తాతాజీ పాల్గొన్నారు.

పూర్వ విద్యార్థుల అపూర్వ కలయిక



సీబీఎం స్కూల్‌లో ఉపాధ్యాయులతో పూర్వ విద్యార్థులు

కొమ్మాది : భీమిలి సీబీఎం హైస్కూల్‌లో 2004వ సంవత్సరంలో 10వ తరగతి చదువుకున్న విద్యార్థులు ఆదివారం అదే స్కూల్‌లో కలుసుకున్నారు. 20 సంవత్సరాల తర్వాత అందరూ ఒక్కసారిగా కలుసుకోవడంతో నాటి జ్ఞాపకాలను నెమరు వేసుకుంటూ సంతోషంగా గడిపారు. నాడు విద్య నేర్పిన ఉపాధ్యాయులను ఘనంగా సత్కరించారు. పూర్వ విద్యార్థుల పేరుతో త్వరలో సేవా కార్యక్రమాలు ప్రారంభించేందుకు నిర్ణయం తీసుకున్నట్లు తెలిపారు.

నేటి నుంచి అమ్మవార్ల ఉత్సవాలు



విజయరాంపురంలో బంగారమ్మ



కృష్ణాపురంలో దుర్గాలమ్మ

పద్మనాభం : మండలంలోని రెండు గ్రామాల్లో సోమవారం నుంచి అమ్మవార్ల ఉత్సవాలు నిర్వహించనున్నారు. కృష్ణాపురంలో మొకర వారి ఇలవేల్పు దుర్గాలమ్మ ఉత్సవాల్లో భాగంగా సోమవారం తొలేళ్ల నిర్వహిస్తారు. ఇందులో భాగంగా అమ్మవారి ఘటాలను గ్రామంలో ఊరేగిస్తారు. మంగళవారం వ్యవసాయ బళ్లను రథాలుగా తీర్చిదిద్ది గ్రామంలో రథోత్సవం నిర్వహిస్తారు. బాందేవుపురం పంచాయతీ విజయరాంపురంలో బంగారమ్మ ఉత్సవాలు నిర్వహిస్తారు. సోమ, మంగళవారాల్లో అమ్మవారి ప్రతిమలైన ఘటాలను ఊరేగిస్తారు. ఉత్సవాలకు సంబంధించి నిర్వాహకులు అన్ని ఏర్పాట్లు చేశారు. ఆలయాల వద్ద లైటింగ్ ఏర్పాటు చేశారు.

మిక్సింగ్ ప్లాంట్‌ల నిర్లక్ష్యంతో అధ్వానంగా రోడ్లు



మధురవాడలో సీసీ వ్యర్థాలతో అస్తవ్యస్తంగా మారిన సుందర రహదారి



లా కాలేజీ రోడ్డులో వ్యర్థాలు డంప్ చేస్తున్న వాహనం

మధురవాడ: సిమెంట్ – కాంక్రీట్ మిక్సింగ్ పరిశ్రమల నిర్లక్ష్యం, ధనదాహం వల్ల విలువైన రోడ్లు, ప్రభుత్వ స్థలాలు నాశనమైపోతున్నాయి. ముఖ్యంగా మధురవాడ పరిసర ప్రాంతాల్లోని మారికవలస – తిమ్మాపురం మాస్టర్ ప్లాన్ రోడ్డు, లా కాలేజీ రోడ్డు, లా కాలేజీ – వుడా కాలనీ, ఓజోన్ వ్యాలీ తదితర విలువైన మాస్టర్ ప్లాన్ రోడ్లు అస్తవ్యస్తంగా తయారయ్యాయి. వీరు సిమెంట్ కాంక్రీట్ మిశ్రమం రవాణా చేసేటప్పుడు నిర్లక్ష్యంగా వ్యవహరించడంతో రహదారిపై చిన్నపాటి ఎత్తు వచ్చినా... రోడ్డు మధ్యలో బ్రేకులు వేయాల్సి వచ్చినా మిశ్రమం వాహనం నుంచి రోడ్డుపై పడి గతుకులుగా మారుతోంది. అలాగే మిగిలిపోయిన మిశ్రమాన్ని రోడ్డు పక్కనే వేసేయడంతో కోట్లాది రూపాయలతో నిర్మించిన రోడ్లు, ఇతర ప్రభుత్వ స్థలాలు పాడవుతున్నాయి. ఈ రోడ్లపై ద్విచక్ర వాహనదారులు ప్రయాణించేటప్పుడు ప్రమాదాలకు గురవుతున్నారు. అయినప్పటికీ స్థానిక అధికారులు కనీస చర్యలు చేపట్టడం లేదు. ప్లాంట్‌ల నిర్వాహకులతో మాట్లాడి, పునరావృతం కాకుండా చూడడం లేదు. ఈ నేపథ్యంలో ఇప్పటికైనా ఉన్నతాధికారులు తక్షణమే స్పందించి చర్యలు చేపట్టాలని స్థానికులు కోరుతున్నారు.

అప్పన్నకు విశేషంగా ఆర్జిత సేవలు



నిత్యకల్యాణంలో కంకణధారణ ఘట్టం నిర్వహిస్తున్న అర్చకులు

సింహాచలం: శ్రీ వరాహ లక్ష్మీనృసింహస్వామికి ఆదివారం ఆర్జిత సేవలు విశేషంగా జరిగాయి. ఉదయం 7 నుంచి స్వర్ణ పుష్పార్చన నిర్వహించారు. ఆలయ కల్యాణమండపంలోని వేదికపై స్వామివారి ఉత్సవమూర్తులు గోవిందరాజస్వామి, శ్రీదేవి, భూదేవిలను అధిష్టంపజేసి 108 స్వర్ణ పుష్పాలతో అష్టోత్తర శతనామావళి పూజ నిర్వహించారు. అర్చకుడు అప్పాజీ తదితరులు కార్యక్రమాన్ని నిర్వహించారు. సూపరింటెండెంట్ పిల్లా శ్రీనివాసరావు ఏర్పాట్లు పర్యవేక్షించారు.
శ్రీ వరాహ లక్ష్మీనృసింహస్వామికి నిత్యకల్యాణం శాస్త్రోక్తంగా నిర్వహించారు. స్వామివారి ఉత్సవ మూర్తులు గోవిందరాజస్వామి, శ్రీదేవి, భూదేవిలను కల్యాణమండపంలోని వేదికపై అధిష్టంపజేశారు. విష్వక్సేనపూజ, పుణ్యాహవచనం, సంకల్పం, కంకణధారణ, యజ్ఞోపవీతం, జీలకర్రబెల్లం, మాంగల్యధారణ, తలంబ్రాలు ఘట్టాలతో కల్యాణం నిర్వహించారు. ఉభయదాతలకు స్వామివారి శేషవస్త్రాలు, ప్రసాదం అందజేశారు.

వీధి దీపాలు వెలగక ఇక్కట్లు



చిట్టివలస హైస్కూల్ నుంచి కార్మికవాడ వరకు వెలగని వీధిదీపాలు



వీధి లైట్లు లేక అంధకారంలో సాయిగణేష్ కాలనీ



మిథిలాపురి వుడా కాలనీలో వెలగని వీధి లైట్లు

తగరపువలస : జీవీఎంసీ భీమిలి, మధురవాడ జోన్‌లలో ఇటీవల పలుచోట్ల వీధి దీపాలు వెలగక స్థానికులు ఇబ్బంది పడుతున్నారు. అంధకారం కారణంగా విష పురుగులు, వీధి కుక్కల ప్రభావం ఎక్కువగా ఉంది. మధురవాడ మిథిలాపురి వుడా కాలనీ సమీపంలో పార్కు నుంచి వచ్చే రహదారిలో చాలా రోజులుగా వీధిదీపాలు వెలగడం లేదని స్థానికంగా నివసిస్తున్న ఎక్కిరాల రుక్మిణి తెలిపారు. అలాగే భీమిలి జోన్ ఒకటో వార్డు చిట్టివలస జెడ్పీ హైస్కూల్‌ను ఆనుకుని కార్మికవాడ వరకు చావుల మదుము రోడ్డులో వారం రోజులుగా వీధిదీపాలు వెలగడం లేదని గుజ్జు వెంకట పైడి సూరిబాబు తెలిపారు. సంబంధిత అధికారులు స్పందించి ఈ రెండు చోట్ల వీధిదీపాలు పునరుద్ధరించాలని కోరుతున్నారు.

వీధి లైట్లు వెలగక ఇబ్బందులు

మధువరాద : ఎన్నికల కోడ్ కారణంగా జీవీఎంసీ అధికారులు వీధిలైట్లు కూడా కొన్ని చోట్ల సక్రమంగా వేయడం లేదు. దీంతో ఆయా కాలనీల నివాసులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. ముఖ్యంగా జీవీఎంసీ 6వ వార్డు జాతీయ రహదారికి అత్యంత సమీపంలో ఉన్న సాయిగణేష్ కాలనీలో నెలున్నర కిందటి నుంచి వీధిలైట్లు చాలా చోట్ల వెలగడం లేదు. స్థానికులు జీవీఎంసీ అధికారులకు ఫిర్యాదు చేసినా పట్టించుకోవడం లేదు. రాకపోకలకు ఇబ్బందులు పడుతున్నామని, దొంగల ముప్పు కూడా పొంచి ఉందని స్థానికులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. ఉన్నతాధికారులైనా తక్షణమే స్పందించి చర్యలు చేపట్టాలని వారు కోరుతున్నారు.

ట్రాఫిక్ నియంత్రణకు స్పెషల్ డ్రైవ్



గురుద్వారా వద్ద ద్విచక్ర వాహనానికి లాక్ వేయిస్తున్న ట్రాఫిక్ ఎస్ఐ భాస్కరరావు

సీతమ్మధార: రహదారి భద్రత దృష్ట్యా రాంగ్ పార్కింగ్ చేసిన వాహనాలకు జరిమానాలు విధించారు. నగర పోలీస్ కమిషనర్ ఆదేశాల మేరకు ద్వారకా జోన్ ట్రాఫిక్ ఎస్ఐ భాస్కరరావు ఆధ్వర్యంలో ఆదివారం గురుద్వారా నుంచి ఆర్టీసీ కాంప్లెక్స్‌కు వెళ్లే మార్గంలో రాంగ్ పార్కింగ్ చేసిన కార్లు, ద్విచక్ర వాహనాలు, వ్యాన్‌లకు లాక్ వేసి ఫైన్ విధించారు. ఈ సందర్భంగా ఎస్ఐ మాట్లాడుతూ ద్వారకా పోలీస్ స్టేషన్ పరిధిలో రాంగ్ పార్కింగ్ చేసిన 30 వాహనాలకు రూ.1,035 చొప్పున జరిమానా విధించినట్లు తెలిపారు. చలానా చెల్లిస్తేనే ఈ వాహనాల లాక్ తీసి ఇస్తామని వాహనదారులకు సూచించారు. ప్రజలకు సౌకర్యవంతమైన రహదారులను ఏర్పరచడానికే ట్రాఫిక్ నియంత్రణ చర్యలు చేపడుతున్నట్లు చెప్పారు.

ఇథలిన్ వాయువుతోనే పండ్లు మగ్గబెట్టాలి



మామిడి పండ్లు

పెందుర్తి: మామిడి పండ్లను కాల్షియం కార్బైట్ సహాయంతో మగ్గబెట్టడం మంచిది కాదని ఉద్యాన శాఖ అధికారి జి.రాధిక అన్నారు. దీని వల్ల ప్రజల ఆరోగ్యానికి ముప్పు వాటిల్లుతుందన్నారు. పక్వానికి వచ్చిన మామిడి కాయలను ఇథలిన్ వాయువు సహాయంతో మగ్గబెడితే ఆరోగ్యానికి ఎటువంటి ముప్పు ఉండదని స్పష్టం చేశారు. పక్వానికి వచ్చిన మామిడి కాయలను గాలి చొరబడకుండే ఉండే గదిలో ఉంచి ఇథలిన్ వాయువు 2 పీపీహెచ్‌ను స్ప్రే చేసి 16 గంటల తర్వాత తీస్తే రుచికరమైన, ఆరోగ్యకరమైన మామిడి పండ్లు లభిస్తాయన్నారు. లేదా బకెట్ నీటిలో ఇథలిన్ ద్రావణం, క్లాసిక్ సోడా కలిపి చల్లిన తర్వాత 24 గంటలు ఉంచాలన్నారు. దీని వల్ల ఇథలిన్ వాయువు విడుదలై మామిడి కాయలు మగ్గుతాయని చెప్పారు. ఎట్టిపరిస్థితిలోనూ ప్రభుత్వం నిషేధించిన కాల్షియం కార్బైట్ వాడరాదని స్పష్టం చేశారు.